క్లుప్తంగా

స్పర్శ లేని మచ్చలుంటే తెలియజేయండి



మెళ్లూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు విజయలక్ష్మి

బిక్కవోలు: ఎవరికైనా స్పర్శ లేని మచ్చలుంటే తెలియజేయాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి అన్నారు. గురువారం మెళ్లూరు గ్రామంలో కుష్టు వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై జిల్లా వ్యాప్తంగా సర్వే జరుగుతుందన్నారు. ఎవరికైనా శరీరంపై నలుపు, లేత తెలుపు, తేనె, రాగి రంగుల్లో పెద్ద మచ్చలుండి స్పర్శ లేకుంటే సర్వే సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చిన్న వైద్యంతోనే వ్యాధిని రాకుండా చూసుకోవచ్చన్నారు. తద్వారా కుష్టు రహిత సమాజాన్ని నిర్మించవచ్చని చెప్పారు. మెళ్లూరులో కొత్తగా ఒక కేసు గుర్తించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే



సీతానగరంలో సర్వే నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సీతానగరం: మండలంలో గురువారం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ జరిగింది. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మండలంలో ఇంటింటికీ పర్యటించి కుష్టు వ్యాధి సర్వే నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి, ఆ ఇంటిలో ప్రతి ఒక్కరిని పరిశీలిస్తారన్నారు. ఎవరికైనా అనుమానాస్పద మచ్చలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇస్తారని తెలిపారు. అనంతరం ఆ మచ్చలు కుష్టు వ్యాధికి సంబంధించినవా, కాదా అనే దానిపై పరీక్ష జరుపుతామని, నిర్ధారణ అయితే వారికి ఇంటి వద్దే మందులు ఉచితంగా ఇస్తామన్నారు.

12 గ్యాస్ సిలిండర్ల సీజ్



కిరాణా దుకాణంలో గుర్తించిన గ్యాస్ సిలిండర్లు

రాజానగరం: కొత్త తుంగపాడు గ్రామంలోని ఒక కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 వంట గ్యాస్ సిలిండర్లను గురువారం పట్టుకుని, నిందితులపై 6ఏ కేసు నమోదు చేశామని మండల సివిల్ సప్లయిస్ అధికారి గొలుగూరి బాపిరాజు తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు కిరాణా దుకాణంలో తనిఖీ చేసి ఆరు ఫుల్, ఆరు ఖాళీ సిలెండర్లను సీజ్ చేశామన్నారు. వాటిని సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి అప్పగించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్లను నిల్వ ఉంచిన దుకాణం యజమాని నాళం చంటిబాబుపై 6 ఏ కేసు నమోదు చేశామన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మధురపూడి: కోరుకొండలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిర్మాణానికి రూ.20,118 విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ నాయకులకు దాతలు అందజేశారు. స్వామివారి భక్తుడు, క్రాఫ్ట్ టీచర్, దివంగత బడేటి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఈ నగదు అందించారు.

తల్లిదండ్రుల ద్వారానే సత్ప్రవర్తన

మధురపూడి: తల్లిదండ్రులు, మంచి స్నేహితుల ద్వారానే పిల్లలకు సత్ప్రవర్తన అలవడుతుందని ఎంపీడీఓ హేమ సుందరరావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాలులో గురువారం బేటీ బచావో– బేటీ పడావో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలన్నారు. బాలికలు ఎటువంటి ఆకర్షణలకు లోనుకాకుండా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సై ఆనంద కుమార్, డీటీ నరేష్, డీసీపీఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సాగుకు అందని భరోసా

- అన్నదాతలకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్న చంద్రబాబు
- కూటమి ప్రభుత్వంలో రైతులకు అందని సాయం
- పీఎం కిసాన్ నిధులు మాత్రమే జమ



పందలపాకలో దుక్కి దున్నుతున్న రైతు

బిక్కవోలు: ఖరీఫ్‌లో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు పంటల సాగును ముమ్మరం చేశారు. అనపర్తి నియోజకవర్గంలో వరి, ఇతర రకాల పంటలు కలిపి 63,835 ఎకరాల్లో సాగు జరుగుతుంది. రైతులకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయాన్ని అందించింది. గత నెలలో రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున నగదు జమైంది. ఈ మొత్తం ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఉపయోగపడింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సాయం ఇంకా విడుదల కాకపోవడంతో 30,327 మంది అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో కౌలు రైతులకూ భరోసా

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా రూపేణా మరో రూ.7500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ మొత్తాన్ని ఏటా మూడు విడతల్లో రైతులకు అందజేసింది. ఇలా రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయాన్ని ఐదేళ్ల పాటు అందించింది. భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు సైతం వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. దీనివల్ల ఎందరో పేద రైతులు లబ్ధి పొందారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలను సాగు చేశారు.

అన్నదాతల ఎదురు చూపు

వర్షాలకు రైతులు పంటలు సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎరువులకు పెట్టుబడి సాయం అవసరం. ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో తోడ్పడింది. ఏటా పీఎం కిసాన్ తొలివిడత సాయం రూ.2 వేలు, వైఎస్సార్ రైతు భరోసా సాయం రూ.3,500 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సాయం రూ.2 వేలు మాత్రమే అందడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామంటూ టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల పెట్టుబడి సాయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్న రైతుల వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం	రైతులు
అనపర్తి	9,967	5,312
బిక్కవోలు	16,503	8,635
రంగంపేట	19,675	8,928
పెదపూడి	17,690	7,452
మొత్తం	63,835	30,327

పంట రుణాలకు పాట్లు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం కారణంగా పాత రుణాలను రెన్యువల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడం లేదు. దీంతో వ్యవసాయ పనుల కోసం రైతులు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. అధిక వడ్డీల భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ అంటూ పథకం మార్చడంలో చూపిన తొందర రాష్ట్ర ప్రభుత్వం సగమైనా రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో చూపించి ఉంటే బాగుండేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తకుప్పలు తక్షణమే తొలగించాలి



సుభద్రంపేటలో డ్రైనేజీల్లో పూడిక తీస్తున్న కార్మికులు

రంగంపేట: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో మండలంలో అన్ని గ్రామాల్లో చెత్త కుప్పలు ఎక్కడున్నా తక్షణమే వాటిని తొలగించాలని ఎంపీడీఓ పి.వెంకటరత్నం ఆదేశించారు. గురువారం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక తొలగించి మురుగునీరు సాఫీగా పారేలా చూడాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు మండల వ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఎక్కడికక్కడ చెత్తను తొలగించి ట్రాక్టర్లపై శివారు ప్రాంతాలకు తరలించారు.

అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: అధిక వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఏఈ చంద్రమోహన్ సూచించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిచిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని, తెగిపడిన వైర్లు కనిపిస్తే, వాటిని ముట్టకోకుండా విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పాడుబడిన భవనాలు, మిద్దె ఇళ్లలో పాతకాలపు స్విచ్ బోర్డులను నేరుగా తాకవద్దన్నారు. విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను నేరుగా పట్టుకోవద్దన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలోని ఏడు డిపోలలో ఇసుకను నిల్వ చేశామని జిల్లా గనులు, భూగర్భ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ ఏడు ఇసుక నిల్వల స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక లోడింగ్, రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనను అతిక్రమించి రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని స్థానిక లారీ యజమానులు, డ్రైవర్లు గమనించాలని కోరారు.

వీధులన్నీ జలమయం.. స్తంభించిన జీవనం

- ఎడతెరిపి లేని వర్షంతో అవస్థలు
- ముంపు బారిన పల్లపు ప్రాంతాలు

రాజానగరం: ఎడతెరిపి లేకుండా గురువారం తెల్లవారుజాము నుంచి జోరుగా కురుస్తున్న వర్షంతో జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించింది. పలుచోట్ల పల్లపు ప్రాంతాలు నీటమునగగా, ప్రధాన రోడ్లు సైతం కాలువలుగా దర్శనమిస్తున్నాయి. దివాన్‌చెరువులో ప్రధాన కూడలి నుంచి శ్రీరామపురం వెళ్లే రోడ్డుపై మోకాలు లోతులో వర్షం నీరు చేరింది. ఈ ప్రాంతంలో ఇటీవలే సీసీ రోడ్డు వేసినప్పటికీ సరైన డ్రైనేజీ సిస్టమ్ లేకపోవడంతో ఈ సమస్య తరచూ ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు. నామవరంలోని యూపీ స్కూలు కూడా జలమయమైంది. వంట షెడ్డులోకి కూడా వర్షం నీరు వెళ్లడంతో విద్యార్థులను సమీపంలోని వేరే భవనం అరుగుపై కూర్చోబెట్టారు. అక్కడే వంట చేసి మధ్యాహ్నం భోజనం వడ్డించారు. పాఠశాలలోకి చేరిన ముంపు నీరు బయటకు పోయేందుకు స్థానికుల సహకారంతో కచ్చా డ్రైనేజీ తవ్వుతున్నారు.

సంపత్‌నగరంలో చెరువుకు గండి

సంపత్‌నగరంలోని పెద్ద చెరువుకు గండి పడింది. ఈ చెరువు కింద సుమారు 800 ఎకరాల వరకు సాగు భూమి ఉంది. అయితే చెరువును ఆనుకుని ఉన్న సుమారు 10 ఎకరాలలో 15 రోజుల క్రితం వేసిన వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. ఇదే పరిస్థితి నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద ముంపు ప్రాంతాలలోని పొలాలలో నెలకొన్నాగానీ, వర్షం తగ్గితే ముంపు నీరు వేగంగా తీసివేసేందుకు అవకాశం ఉంది.

ములకల్లంకకు రాకపోకలు బంద్

సీతానగరం: గోదావరికి వరద పోటెత్తడంతో మండలంలోని ములకల్లంకకు రాకపోకలు బంద్ అయ్యాయి. బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాల మధ్య ఉన్న గోదావరిలో నిర్మించిన రోడ్డు మునిగిపోయింది. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీనితో గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న రెండు మర పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. బొబ్బిల్లంక రైతులకు చెందిన లంకభూములు ములకల్లంక వద్ద ఉండటంతో గోదావరి పాయలో వేసిన రోడ్డు మీదుగానే రాకపోకలు జరుపుతారు. గోదావరి వరదతో ఆ గ్రామానికి మార్గం తెగిపోయింది. గత ఏడాది గోదావరి వరద ఉధృతంగా రావడంతో అధికారులు గోదావరిలో మర పడవలపై ప్రయాణం ప్రమాదానికి దారితీస్తుందనే ఉద్దేశంతో లాంచీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామంలో లోతట్టు ప్రాంతం ముంపులోకి వెళ్లింది. ములకల్లంక వాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



నామవరంలోని పాఠశాల ఆవరణలోకి చేరిన నీరు



ముంపునకు గురైన దివాన్‌చెరువు-శ్రీరామపురం రోడ్డు



సంపత్‌నగరంలో పెద్ద చెరువుకు పడిన గండి

రావిపాటి సేవలు చిరస్మరణీయం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

మధురపూడి: విద్యాభివృద్ధిని విశ్రాంత జాయింట్ సెక్రటరీ రావిపాటి శ్రీనివాసరావు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రావిపాటి శ్రీనివాసరావు 94వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రావిపాటి శ్రీనివాసరావు స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. శ్రీనివాసరావు తన పెన్షన్ ద్వారా వచ్చిన రూ.ఆరు లక్షలను స్కూల్ పేరుమీద డిపాజిట్ చేశారన్నారు. దానిపై వచ్చే వడ్డీతో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కోలా సత్యనారాయణ మాట్లాడుతూ డిపాజిట్ వడ్డీ రూ.2,900లతో 17 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. రేఖపల్లిలోని పద్మావతి సంస్థకు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సుజాత, స్కూల్ హెచ్‌ఎం మణికుమార్, స్థానిక ప్రజాప్రతినిధి కర్రి గణేష్, రావిపాటి శ్రీనివాసరావు స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షురాలు రావిపాటి సత్యవతి, సభ్యులు పాల్గొన్నారు.

డయేరియాకు కారణమవుతున్న కోళ్ల ఫారాలు



అచ్యుతాపురంలో కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వీణాదేవి

రంగంపేట: గ్రామాల్లో డయేరియా ప్రబలడానికి కోళ్ల ఫారాలు కారణమవుతున్నాయని రాజమహేంద్రవరం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌పీఓ) పి.వీణాదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామంలోని కోళ్ల ఫారాలను గురువారం ఆమె ఎంపీడీఓ పి.వెంకటరత్నంతో కలసి తనిఖీ చేశారు. కోళ్ల ఫారాల్లో పెంట వల్ల ఈ ప్రదేశంలోను, గ్రామంలోను ఈగలు విపరీతంగా పెరిగిపోవడమే కాక, కోళ్ల ఫారాల్లోని దుర్గంధపు నీరు గ్రామానికి ఆనుకుని ఉన్న డ్రైనేజీలోకి వెళుతుందన్నారు. దీనిపై కోళ్ల ఫారం సిబ్బందిని నిలదీశారు.

గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ అక్కడి పరిస్థితులను ఆమెకు తెలియజేశారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీపీటీఓకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షల విషయంలో సమన్యాయం పాటిస్తున్న సర్క్యులర్ 1/2019ను కచ్చితంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న డబుల్ డ్యూటీలను రద్దు చేసి, డ్రైవర్ల రిక్రూట్ మెంట్ చేపట్టాలన్నారు. ఈ ఆందోళనలో పూర్వ తూర్పుగోదావరి జిల్లాలోని తొమ్మిది డిపోల నుంచి ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరూ సచివాలయాల్లోనే ఉండాలి



రంగంపేట పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వీణాదేవి

రంగంపేట: ఉద్యోగులందరూ తప్పనిసరిగా సచివాలయాల్లోనే ఉండాలని రాజమహేంద్రవరం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌పీఓ) వీణాదేవి సూచించారు. మండలంలోని ఈలకొలను, అచ్యుతాపురం, రంగంపేట గ్రామాల్లోని సచివాలయాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈలకొలను సచివాలయం నుంచి మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బందితో గూగుల్ మీట్ ద్వారా ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయాల్లో చేపట్టవలసిన ప్రాధాన్య కార్యక్రమాలు, సిబ్బంది హాజరు, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై పలు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం సచివాలయంలో ఆన్‌లైన్ హాజరు నమోదు చేయాలని ఇందులో ఏ ఒక్క ఉద్యోగికీ మినహాయింపు లేదన్నారు. ఈలకొలను పంచాయతీ కార్యదర్శి సుబ్బారాయుడు మరో మూడు పంచాయతీలకు ఇన్‌చార్జిగా ఉండటంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే మరో కార్యదర్శిని నియమించాలని ఎంపీడీఓ వెంకటరత్నంకు సూచించారు. రంగంపేట 1, 2 సచివాలయాల్లో హాజరు శాతాన్ని, రికార్డులను పరిశీలించారు. మండలంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన దరఖాస్తుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.వెంకటరత్నం, ఈలకొలను సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, కార్యదర్శి పి.సుబ్బారాయుడు, సచివాలయ కార్యదర్శి వెంకన్నబాబు, సుంకరరాజు, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ బుంగా రామారావు గురువారం పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి, సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, ఎంపీటీసీ వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పెదపూడి: నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశించారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో అభివృద్ధి పనులపై ఆయన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏ గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులు అవసరమో ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

కిట్ల అందజేత

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు స్కూల్ కిట్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, ఉప సర్పంచి పడాల వెంకటరామారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆర్యాపురం బ్యాంక్ పరిరక్షణకే పోటీ

- ఉన్నతమైన వ్యక్తులతో నందెపు ప్యానల్
- ఓటమి భయంతోనే రౌతుపై ఆరోపణలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం, చిత్రంలో నందెపు శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు, జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను పరిరక్షించాలన్న ఉద్దేశంతోనే ఎన్నికల్లో పోటీకి దిగుతున్నామని చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్, ప్యానల్ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక సంహిత ఫంక్షన్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పలు రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులతో బ్యాంక్ ఎన్నికల్లో మంచి ప్యానల్‌ను ఏర్పాటు చేశామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్, క్రెడాయ్, రోటరీ, ఎస్‌వీ మార్కెట్, లయన్స్ వంటి వ్యాపార, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన అనుభవంతో నందెపు శ్రీనివాస్ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. ప్యానల్ లోని నందం కుమార్ రాజా, లంక సత్యనారాయణ, దూడల త్రినాథ్, పెదిరెడ్ల శ్రీనివాస్, కస్సే రాజేష్, పెంకే సురేష్ వివిధ రంగాల నుంచి రావడమే కాకుండా, బ్యాంక్ డైరెక్టర్లుగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ప్రాతినిథ్యం కల్పించాలనే ఉద్దేశంతో కూండ్రపు రాంబాబును ప్యానల్‌లో పెట్టామన్నారు. బ్యాంక్‌లో అవకతవకలకు పాల్పడి 51 ఎంక్వయిరీ ఎదుర్కొన్న వ్యక్తితోనే ప్యానల్ ఏర్పాటు చేయడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయన్నారు.

చల్లా అసత్య ఆరోపణలు

మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంక్ మాజీ చైర్మన్, ప్రస్తుత చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో అసిస్టెంట్ సీఈఓ సుధాకర్, నాటి డైరెక్టర్ రంగబాబుతో ఫిర్యాదులు చేయించి 51 ఎంక్వయిరీ వేయించారన్నారు. చల్లాపై 51 ఎంక్వయిరీ 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని గుర్తు చేశారు. రూ.5.62 కోట్లు బ్యాంక్‌కు చెల్లించాలని బ్యాంక్ చైర్మన్, సీఈఓ, డైరెక్టర్‌లకు పెనాల్టీ విధించారన్నారు. అప్పటి సీఈఓ సుబ్రహ్మణ్యాన్ని బ్యాంక్ నుంచి బయటకు పంపించాలని వేయించిన 51 ఎంక్వయిరీ తిరిగి చల్లా మెడకే చుట్టుకుందన్నారు.

బ్యాంకింగ్ రంగాన్ని కాపాడుకుందాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ చిరు వ్యాపారులు, పేద వర్గాలకు చేయూతనిచ్చే సహకార బ్యాంకింగ్ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల్లో నందెపు శ్రీనివాస్ ప్యానల్‌ను గెలిపించాలని కోరారు. దేశంలోనే మంచి గుర్తింపు కలిగిన ఆర్యాపురం బ్యాంక్ ప్రతిష్ఠను మరింత పెంచేలా పనిచేయగల సామర్థ్యం నందెపు శ్రీనివాస్ ప్యానల్‌కు ఉందన్నారు. బ్యాంక్ డిపాజిట్‌లు ప్రస్తుతం రూ.680 కోట్లు ఉన్నాయని వాటిని రెట్టింపు చేయడం, ఏపీఏను తగ్గించి సాప్ నుంచి బ్యాంక్‌ను బయటకు తీసుకువచ్చి వాటాదారులకు 15 శాతం డివిడెండ్‌లు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డైరెక్టర్ అభ్యర్థులు, విజయలక్ష్మి, సంకిన భవానీ ప్రియ పాల్గొన్నారు.

నందెపు బెల్ట్‌ను గెలిపించాలి

ప్రకాశం నగర్: ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ అభివృద్ధి కోసం నందెపు శ్రీనివాస్ బెల్ట్‌ను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం నగర సమితి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బ్యాంక్ పాలక మండలి చైర్మన్‌గా చల్లా శంకర్రావు ఉన్నప్పుడు అనేక అవకతవకలు జరిగాయన్నారు. వాటిపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.